E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు   జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387



PUBLISHED: JANGAON,HYDERABAD   సంపుటి :01   సంచిక :280   శుక్రవారం 18 సెప్టెంబర్ 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 04   వెల :05/-


# తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

## సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం

## జనగామను ఎరుపెక్కించిన ఎర్రదండు..భారీ ర్యాలీ, బహిరంగ సభ



**తెలుగు గళం న్యూస్ జనగామ, సెప్టెంబర్ 17**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించి మత విద్వేషాలకు, రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని చూస్తే ప్రజలు సహించబోరని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని ఎవరూ చెరిపివేయలేరని స్పష్టం చేశారు.సెప్టెంబర్ 17 సందర్భంగా సిపిఎం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్మారక బహిరంగ సభ నిర్వహించారు.పట్టణంలోని క్రిస్టియన్ గ్రౌండ్ నుంచి కామాక్షి ఫంక్షన్ హాల్ వరకు సిపిఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం కామాక్షి ఫంక్షన్ హాల్‌లో జరిగిన బహిరంగ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ..తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కేవలం నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం మాత్రమే కాదన్నారు.భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో సామాన్య ప్రజలు సాగించిన మహత్తర ప్రజా పోరాటమని పేర్కొన్నారు.వేలాది మంది ప్రాణత్యాగాలతో, అనేక గ్రామాలను విముక్తి చేసి, పేదలకు భూములు పంచి, గ్రామాల్లో ప్రత్యామ్నాయ ప్రజా పాలనకు పునాదులు వేసిన పోరాటాన్ని కేవలం ఒక మతానికి, మరో మతానికి మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించడం చరిత్రను వక్రీకరించడమేనన్నారు.నాటి హైదరాబాద్ సంస్థానంలో పాలకుడు ముస్లిం కావడం వాస్తవమే అయినప్పటికీ, ప్రజలను దోపిడీ చేసిన భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లలో వివిధ మతాలకు చెందినవారు ఉన్నారని గుర్తుచేశారు. నిజాం వ్యతిరేక పోరాటంలో హిందువులు, ముస్లింలు కలిసి పాల్గొన్నారని తెలిపారు. బందగీ, మఖ్దూం మొహియుద్దీన్, షోయబుల్లాఖాన్ వంటి ముస్లిం ప్రజా నాయకులు కూడా నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. అదే సమయంలో విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి వంటి హిందూ భూస్వాములు నిజాం పాలనకు అండగా నిలిచిన విషయాన్ని చరిత్ర చెబుతోందన్నారు. అందువల్ల తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ--ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం వాస్తవాలకు విరుద్ధమని పేర్కొన్నారు.సెప్టెంబర్ 17న నిజాం భారత సైన్యాల ముందు లొంగిపోయిన ఘటనను మాత్రమే చూపిస్తూ మొత్తం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను మరుగునపరచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ చారిత్రక ఘటనను మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఉపయోగించడం ప్రమాదకరమన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సెప్టెంబర్ 17న ప్రారంభం కాలేదని, ఆ రోజుతో ముగియలేదని తమ్మినేని వీరభద్రం అన్నారు. నిజాం లొంగిపోయిన అనంతరం కూడా తెలంగాణలో కమ్యూనిస్టులపై, ప్రజా ఉద్యమాలపై సైనిక అణచివేత కొనసాగిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 చుట్టూ జరుగుతున్న రాజకీయ ప్రచారాలను చారిత్రక సందర్భంలోనే ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టుల పాత్రను చరిత్ర నుంచి చెరిపివేయడానికి వివిధ రాజకీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని తమ్మినేని వీరభద్రం అన్నారు. పోరాటంలో పాల్గొనని శక్తులు నేడు ఆ పోరాట వారసత్వాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు.భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం, గౌరవప్రదమైన జీవితం కోసం రైతులు, కూలీలు, మహిళలు, సామాన్య ప్రజలు సాగించిన పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని వివరించారు. ఆ పోరాట ఫలితంగా భూసంస్కరణల ప్రశ్న దేశ రాజకీయ ఎజెండాలోకి వచ్చిందని పేర్కొన్నారు.

ఆకలి, నిరుద్యోగం, అసమానతలు, కార్మిక--రైతు సమస్యలు తీవ్రమవుతున్న సమయంలో ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని తమ్మినేని వీరభద్రం అన్నారు. మతం పేరుతో ప్రజలను విడదీసి రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూసే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.తెలంగాణ సాయుధ పోరాటం ప్రజల ఐక్యతను నేర్పిందని, కులమతాలకు అతీతంగా శ్రమజీవులు ఐక్యంగా పోరాడితేనే సామాజిక మార్పు సాధ్యమవుతుందని అన్నారు.సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ మాట్లాడుతూ..ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి, పెరుగుతున్న అసమానతలు, దోపిడీ, మత విద్వేషాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రను వక్రీకరించినంత మాత్రాన దాని వాస్తవాలను ప్రజల నుంచి దాచలేరని అన్నారు. చరిత్రను చెరిపేయలేరని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే అమరవీరులకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, రాపర్తి సోమయ్య, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాష్, బూడిద గోపి, సుంచు విజయేందర్, మునిగల రమేష్, పోతుకునూరి ఉపేందర్, బోడ నరేందర్, గుండెబోయిన రాజు, ఎండి షబానా, ఎండి అజారుద్దీన్, బెల్లంకొండ వెంకటేష్, చిట్యాల సోమన్న తదితరులు పాల్గొన్నారు. వివిధ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో ర్యాలీ, బహిరంగ సభలో పాల్గొన్నారు.





# ఎస్‌బీఎన్‌పై కేంద్రం కఠిన చర్య!



2 లో

న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం): పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్ (ఎస్‌బీఎన్)'ను చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

# బ్రిక్స్ వేళ పాక్, ఐఎస్ఐ ఉగ్ర కుట్ర బట్టబయలు



2 లో

- బ్రిక్స్ సదస్సుపై ఉగ్ర కుట్రకు పాక్ ప్లాన్
- సరిహద్దు నుంచి ఉగ్రవాదుల చొరబాటుకు యత్నం
- హీరానగర్ సెక్టార్‌ను ఎంచుకున్న ఉగ్ర మూకలు
- బోబియా ప్రాంతంలో చొరబాటు స్థావరాల గుర్తింపు
- భద్రతా బలగాల అప్రమత్తతతో కుట్ర భగ్నం
- ప్రభుత్వ భవనాలు, సైనిక శిబిరాలే లక్ష్యమా?
- పెను ఉగ్రదాడి తప్పడంతో ఊపిరిపీల్చుకున్న భారత్

# ట్యాంక్‌బండ్‌పై హైకోర్టు ఆంక్షలు!



2 లో

- ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి లేదు
- హైకోర్టు ఆదేశాలతో అధికారులు కీలక నిర్ణయం
- హుస్సేన్‌సాగర్ పరిరక్షణకు కఠిన చర్యలు
- ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు
- నగరవ్యాప్తంగా ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లు
- బేబీ పాండ్స్.. కృత్రిమ కొలనులు సిద్ధం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

# విమోచన వీరులను మరువొద్దు!

- విమోచన దినోత్సవ వేడుకల్లో ఉపరాష్ట్రపతి
- ప్రజా ఉద్యమంగా విమోచన పోరాటం
- రాంజీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్ త్యాగాలు
- పటేల్ పాత్రను గుర్తుచేసిన రాధాకృష్ణన్
- కేంద్ర బలగాల సేవలకు ప్రశంసలు
- సమాన హక్కులతోనే జాతీయ ఐక్యత



2 లో

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా ఇక్కడ ఉండటం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ అన్నారు. హైదరాబాద్ సంస్థానం విమోచన, భారతదేశంలో విలీనం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గౌరవించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

హైదరాబాద్ విమోచన పోరాటంలోని మరుగునపడిన వీరుల కథలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ పోరాటం కేవలం ప్రభుత్వాలు లేదా ప్రముఖ నాయకులకు సంబంధించినది కాదని.. ఇది ప్రజా ఉద్యమమని అన్నారు. విద్యార్థులు, మేధావులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ కార్యకర్తలు, రైతులు, సామాన్య ప్రజలు ఇందులో పాల్గొన్నారని గుర్తుచేశారు. అనేక మంది జైలు శిక్షలు, హింస, వ్యక్తిగత ఇబ్బందులను ఎదుర్కొన్నారని తెలిపారు.

# క్షుద్ర పూజల వివాదం.. కోర్టుకెక్కిన హరీశ్!

- క్షుద్ర పూజల ఆరోపణలపై కేసు
- మహేష్ గౌడ్, దయాకర్‌లకు నోటీసులు
- స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయం
- నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్
- కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ పరువునష్టం దావా
- రాజకీయ ప్రతిష్ట దెబ్బతీసేలా ఆరోపణలు
- ఆరోపణలను ఖండించిన హరీశ్ రావు

2 లో

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈసీ కసరత్తు!

- రెండు స్థానాలకు ఓటర్ల జాబితా
- నవంబర్ 1 అర్హత తేదీ
- పాత ఓటర్లూ కొత్తగా దరఖాస్తు
- ఫారమ్-18తో దరఖాస్తు తప్పనిసరి
- విద్యార్హత సర్టిఫికెట్లు జతచేయాలి
- నవంబర్ 25న డ్రాఫ్ట్ జాబితా
- డిసెంబర్ 30న తుది జాబితా





**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణలో త్వరలో ఖాళీ కాబోతున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్ నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కోసం ఈసీ కసరత్తు మొదలు పెట్టింది. ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు నూతన ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ నియోజకవర్గాల స్థానాల గడువు మార్చి 2027తో ముగియనుండటంతో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్తగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నారు.

2 లో

# విలీన పోరాటంపై కవిత కీలక వ్యాఖ్యలు!

- సెప్టెంబర్ 17 చరిత్రపై రాజకీయ రగడ
- కాంగ్రెస్, బీజేపీలపై కవిత తీవ్ర విమర్శలు
- విలీన పోరాటాన్ని వక్రీకరిస్తున్నారన్న ఆరోపణ
- ఆనాటి పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎక్కడ?
- మతాలకు అతీతంగా ప్రజల పోరాటం
- పోరాట యోధుల త్యాగాలను కవిత స్మరణ
- ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందన్న కవిత

2 లో

# అక్టోబర్ 1 నుంచి కొత్త చట్టం!

- నమ్మ క్లినిక్‌లో అవకతవకలపై ఆరోపణలు
- విధులకు రాకుండానే రెండేళ్లుగా జీతం
- ఆర్టీఐ రికార్డులతో వెలుగులోకి వ్యవహారం
- ఎమ్మెల్యే మేనకోడలిపై తీవ్ర ఆరోపణలు
- ప్రజాధనం దుర్వినియోగంపై ప్రతిపక్షాల ఫైర్
- సమగ్ర విచారణకు ప్రతిపక్షాల డిమాండ్

2 లో

# క్షుద్ర పూజల వివాదం.. కోర్టుకెక్కిన హరీశ్!



**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** చేతబడులు, క్షుద్ర పూజల పేరుతో తనపై తీవ్రమైన, నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు న్యాయపోరాటానికి దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారికి లీగల్ నోటీసులు జారీ చేసిన హరీశ్ రావు, వారు బహిరంగ క్షమాపణ చెప్పకపోవడంతో ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాప్రతినిధుల నాంపల్లి కోర్టులో కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. తన రాజకీయ ప్రతిష్టను, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ నేతలు అసత్య ఆరోపణలు చేశారని ఇప్పటికే హరీష్ రావు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసు నేపథ్యం..

తెలంగాణలో వర్షాలు పడకుండా అడ్డుకునేందుకు హరీశ్ రావు వేర్వేరు ప్రాంతాలు, ఆలయ సందర్శనలు చేసి క్షుద్ర పూజలు నిర్వహించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన హరీశ్ రావు.. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎప్పుడూ లేని విధంగా తన భక్తిభావాన్ని కూడా రాజకీయం చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గతంలో లీగల్ నోటీసులు పంపినప్పటికీ స్పందన రాకపోవడంతో, తాజాగా కోర్టు మెట్లెక్కినట్లు తెలుస్తోంది.

# 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ!

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. హైదరాబాద్ నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి రాష్ట్ర ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే.ఇక జెండా ఆవిష్కరణ తర్వాత.. రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వ పాలనను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు ప్రాతిపదిక అని సీఎం పేర్కొన్నారు. అభివృద్ధి కేవలం గణాంకాల్లో కనిపించడం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పుగా ప్రతిబింబించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, పంటల కొనుగోళ్లు వంటి చర్యలను కూడా ప్రభుత్వం కొనసాగిస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు.

సామాజిక న్యాయం దిశగా సమగ్ర కుల సర్వే చేపట్టామని, బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుతోపాటు కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం వంటి ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. ఉద్యోగాల భర్తీలోనూ ప్రభుత్వం ముందడుగు వేసిందని సీఎం రేవంత్ తెలిపారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టామని, ఖాళీ పోస్టులను దశలవారీగా భర్తీ చేస్తామని ప్రకటించారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రైజింగ్ విజన్ 2047తో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. 30 వేల ఎకరాల్లో దేశంలోనే తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని ప్రతిపాదించామన్నారు. సాంకేతికత, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు తెలంగాణను కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చరిత్రను మరవకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ తెలంగాణను మరింత అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# అక్టోబర్ 1 నుంచి కొత్త చట్టం!




**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా జనన, మరణాల ఆలస్య నమోదుపై నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం-2026' అక్టోబర్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఈ మేరకు భారత రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఆమోద ముద్ర పడటంతో ఈ సవరణ బిల్లు చట్ట రూపం దాల్చింది. ఈ నూతన చట్టం ప్రకారం పుట్టుకలు, మరణాల వివరాల నమోదులో ఎలాంటి జాప్యం, అవకతవకలు జరగకుండా నిరోధించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలను నిర్దేశించింది.

సెక్షన్ 1 లోని ఉప-సెక్షన్ (2) ద్వారా సంక్రమించిన అధికారాల మేరకు కేంద్ర ప్రభుత్వం 2026 అక్టోబర్ 1ని ఈ చట్ట నిబంధనలు అమలులోకి వచ్చే తేదీగా ఖరారు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నూతన సవరణ చట్టం ద్వారా డిజిటల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు పాఠశాల ప్రవేశాలు, పాస్‌పోర్ట్, ఆధార్, ఓటర్ కార్డు, వివాహ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జనన ధ్రువీకరణ పత్రం అత్యంత కీలకమైన ప్రాథమిక పత్రంగా మారనుంది. ఆలస్యంగా చేసుకునే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను క్రమబద్ధీకరించడం, నకిలీ సర్టిఫికెట్లను అరికట్టడం, పారదర్శకమైన కేంద్రీకృత డాటాబేస్‌ను నిర్వహించడమే లక్ష్యంగా ఈ చట్ట నిబంధనలను అమలు చేయనున్నారు.

# ట్యాంక్‌బండ్‌పై హైకోర్టు ఆంక్షలు!




**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** హైదరాబాద్ నగర పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలకు సంబంధించి అధికారులు కీలక ప్రకటన చేశారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కఠిన ఆదేశాల నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి అనుమతి లేదని హైదరాబాద్ సిటీ పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

హైకోర్టు ఆదేశాల మేరకు..

హుస్సేన్‌సాగర్‌ను కాలుష్యం బారి నుంచి రక్షించడానికి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి విగ్రహాల నిమజ్జనానికి తావులేదని అధికారులు తేల్చిచెప్పారు. ఉత్సవ కమిటీలు, పూజా సంఘాలు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

ఈ ఏడాది ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలను నిషేధించినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా పలుచోట్ల ప్రత్యేక బేబీ పాండ్స్, క్రేన్లు, కృత్రిమ నిమజ్జన కొలనులను ఏర్పాటు చేశారు. ఒకవేళ నిబంధనలను ఉల్లంఘించి ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి ప్రయత్నించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిటీ పోలీసులు హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రభుత్వ సూచనల మేరకు పండగను జరుపుకోవాలని కోరారు.

# కేసీఆర్ భూములపై రగడ!



**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయాల్లో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆస్తులపై మరోసారి తీవ్ర రాజకీయ విమర్శలు తెరపైకి వచ్చాయి. అసెంబ్లీ వేదికగా.. కేసీఆర్ ఫాంహౌస్, ఆయన కుటుంబానికి ఉన్న భూములకు సంబంధించిన వివరాలను వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ భూములు ఉంటే నిగ్గు తేల్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే అటు బీఆర్ఎస్.. ఇటు కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రభుత్వ భూముల విషయంలో తీవ్ర మాటల యుద్ధం నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తూ.. బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కేటీఆర్, జగదీష్ రెడ్డిలు.. తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా చేసిన ట్వీట్ తెగ వైరల్ అవుతోంది. ఆ ట్వీట్‌లో కేసీఆర్ గతంలో ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించిన భూములు, ఆస్తుల వివరాలను బయటపెట్టారు.

కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లలో పేర్కొన్న ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలు ప్రశ్నలు సంధించారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన కేసీఆర్.. తనకు భూమి లేదని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని చెప్పారు. ఆ తర్వాతి కాలంలో ఆయన కుటుంబానికి భారీగా భూములు, ఆస్తులు ఎలా సమకూరాయని ప్రశ్నించారు. కేసీఆర్ ఆస్తుల విషయంలో ఎన్నికల అఫిడవిట్‌లే కీలక ఆధారాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ కుటుంబ ఆస్తులు భారీగా పెరిగాయని మంత్రి పొంగులేటి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌లో తన పేరుపై వ్యవసాయ భూమి, ఇతర భూములు లేవని పేర్కొన్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం ఎన్నికల అఫిడవిట్‌లలో కనిపించే ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ.. ఈ మార్పులకు కారణం ఏంటని నిలదీశారు.

ఎన్నికల అఫిడవిట్‌లలో అభ్యర్థులు స్వయంగా ప్రకటించే ఆస్తుల వివరాలు నమోదవుతాయి. వాటిలో భూములు, ఇళ్లు, వాణిజ్య ఆస్తులు, ఇతర స్థిరాస్తులు, అప్పులు వంటి అంశాలను తప్పకుండా పేర్కొనాల్సి ఉంటుంది. కేసీఆర్ కుటుంబ ఆస్తుల పెరుగుదలపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి పొంగులేటి.. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు, పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూముల విషయంలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఆ భూముల కారణంగానే కేసీఆర్ కుటుంబానికి భారీ స్థాయిలో ఆస్తులు సమకూరాయని విమర్శలు గుప్పించారు.

మా తాతకు వందల ఎకరాలుండేవి.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఛాలెంజ్

మరోవైపు.. కేసీఆర్ భూముల విషయంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా మంత్రి పొంగులేటి మండిపడ్డారు. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాల భూములు ఉన్నాయని చెబుతున్న కేటీఆర్‌పైనా పొంగులేటి విమర్శలు చేశారు. అలాంటి వాదనలకు, ఎన్నికల అఫిడవిట్‌లలో నమోదైన వివరాలకు మధ్య వ్యత్యాసం ఉంటే దానిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆస్తుల విషయంలో అఫిడవిట్‌లో తప్పులు నమోదయ్యాయా.. లేక ప్రజలకు వేరే వివరాలు చెబుతున్నారా.. అని కేటీఆర్‌ను ఉద్దేశించి పొంగులేటి ప్రశ్నించారు.

తెలంగాణలో గత కొంతకాలంగా భూములు, 22ఏ నిషేధిత జాబితా, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల అంశాలు అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వివాదానికి కేంద్రంగా మారుతున్నాయి. ఇటీవల రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ జాబితాలో భూముల సమస్య పెరిగిందని ఆరోపించారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు కూడా స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లలోని ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ పొంగులేటి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# విలీన పోరాటంపై కవిత కీలక వ్యాఖ్యలు!



**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు మరియు త్యాగాల చరిత్రకు నిదర్శనం అన్నారు. అయితే ఈ చారిత్రక రోజుపై కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

కాంగ్రెస్, బీజేపీలపై ఘాటు విమర్శలు:

సెప్టెంబర్ 17 చరిత్రను కాంగ్రెస్, బీజేపీలు వక్రీకరిస్తున్నాయని కవిత విమర్శించారు. స్టేట్ కాంగ్రెస్ పోరాటం వల్లే తెలంగాణ విలీనమైందని సీఎం అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. నిజానికి సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని నాడు గాంధీజీ అన్నారని కవిత గుర్తుచేశారు. నిజాం సర్కార్ పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని, భారత యూనియన్‌లో కలిశాక తిరిగి జమీందార్లకు అప్పగించిందే కాంగ్రెస్ అని ఆరోపించారు. ఇక ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటమని బీజేపీ మత రంగు పులిమే ప్రయత్నం చేస్తోందని కవిత ధ్వజమెత్తారు. ఆనాటి పోరాటంలో అసలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ లేనే లేవని స్పష్టం చేశారు.

ప్రజలే తుపాకీ పట్టి పోరాడారు:

ఆనాటి జాగీర్‌దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాడారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి లాంటి మహనీయులు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తుచేశారు. కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినోద్దీన్ వంటి కవులు, రచయితలు సమరశంఖం పూరించారని కొనియాడారు. వారి చైతన్యంతోనే దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, అరుట్ల కమలాదేవి లాంటి వీరులు ఉద్భవించారని పేర్కొన్నారు. నాడు మహనీయులు చూపిన పోరాట స్ఫూర్తితోనే, ప్రస్తుతం కులమతాలకు అతీతంగా ప్రజల హక్కులను కాపాడేందుకు తెలంగాణ రక్షణ సేన ముందుకు వచ్చిందని, అరాచక పాలనకు అంతం పలికే వరకు పోరాటం కొనసాగుతుందని కవిత అన్నారు.

# ఎస్‌బీఎన్‌పై కేంద్రం కఠిన చర్య!

మొదటి పేజీ తరువాయి

ఉపాలోని సెక్షన్ 35(1)(ఏ) ప్రకారం మొదటి షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా, దేశంలో నిషేధించిన 46వ ఉగ్రవాద సంస్థగా ఎస్‌బీఎన్ నమోదైంది. ఈ సిండికేట్ సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయడమే కాకుండా, అమాయకులైన యువతను, స్థానిక నేరస్థులను ప్రలోభపెట్టి ఉగ్రవాదం వైపు మళ్లిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని 'ఉగ్రవాదంపై జీరో టోలరెన్స్ ' విధానంలో భాగంగానే ఈ కఠిన చర్య తీసుకున్నట్లు హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెట్‌వర్క్ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను, మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విద్వేషపూరిత, రెచ్చగొట్టే కంటెంట్‌ను ప్రచారం చేస్తోందని ప్రభుత్వం ఆరోపించింది. ఇతర నిషేధిత ఉగ్ర సంస్థలతో కుమ్మక్కై దేశ వ్యతిరేక కార్యకలాపాలకు నిధులు సమీకరించడం, ప్రజా శాంతికి భంగం కలిగించడంలో ఎస్‌బీఎన్ భాగస్వామ్యం కలిగి ఉందని తెలిపింది. ఈ నెట్‌వర్క్ సభ్యులపై ఉపా, భారతీయ న్యాయ సంహిత, ఆయుధాల చట్టం, ఐటీ చట్టం, పేలుడు పదార్థాల చట్టాల కింద ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

# బ్రిక్స్ వేళ పాక్, ఐఎస్ఐ.. ఉగ్ర కుట్ర బట్టబయలు

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** ఇండియా ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బ్రిక్స్ సదస్సును పాకిస్తాన్, ఆ దేశ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఐఎస్ఐ భగ్నం చేయాలని ప్రయత్నించాయి. ఈ విషయం తాజాగా బయటపడింది. ఈ అంశంపై ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. న్యూఢిల్లీలో అంతర్జాతీయ బ్రిక్స్ సదస్సు సెప్టెంబర్ 11-13 వరకు ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వంటి అగ్రనేతలు హాజరయ్యారు. ఈ సదస్సు ఇండియా నిర్వహించిన తీరు ప్రత్యేకంగా నిలిచింది.

అయితే, ఇలాంటి సదస్సుకు ఆటంకం కలిగించాలని పాక్, ఐఎస్ఐ ప్రయత్నించాయి. జమ్మూ కాశ్మీర్ కథ్వా జిల్లాలోని హీరానగర్ సెక్టార్ నుంచి ఉగ్రవాదులను సరిహద్దుగుండా ఇండియా పంపించాలని ప్రయత్నించింది. సదస్సు సందర్భంగా దేశంలో పెద్ద ఉగ్రదాడి జరపాలని ప్రయత్నించింది. ఇందుకోసం హీరానగర్‌లోని బోబియా ప్రాంతంలో సరిహద్దు నుంచి ఇండియాలోకి చొరబడేందుకు కొన్ని స్థావరాల్ని కూడా పాక్ ఉగ్రవాదులు ఎంపిక చేసుకున్నారు. కానీ, ఈ విషయాన్ని ప్రభుత్వ భద్రతా దళాలు ముందుగానే పసిగట్టాయి. ఆయా ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశాయి. పాకిస్తాన్‌లోని అమ్రు చాక్, సుక్మాల్ ప్రాంతాలు.. ఇండియాలోని హీరానగర్ ప్రాంతాన్ని సరిహద్దుగా పంచుకుంటాయి.

ఇది మన సరిహద్దుకు అతి దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడినుంచి ఇండియాలోకి సులభంగా చొరబడవచ్చని పాక్, ఐఎస్ఐ భావించాయి. ఈ ప్రాంతంలో చొరబాటుదారులకు రక్షణ కల్పించే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలోనే జమ్మూ-పఠాన్‌కోట్ హైవే ఉంది. ఇక్కడినుంచి ఇండియాలోని ప్రభుత్వ భవనాలు, మిలిటరీ క్యాంపులు, సాధారణ ప్రజల్ని లక్ష్యంగా చేసుకోవాలని భావించారు. అయితే, భద్రతా బలగాల అప్రమత్తతతో పెను ఉగ్రదాడి తప్పింది.

# విమోచన వీరులను మరువొద్దు!

మొదటి పేజీ తరువాయి



రాంజీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీమ్ తదితర వీరుల త్యాగాలను జాతీయ స్మృతిలో గుర్తుంచుకోవాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. చరిత్రను కేవలం ప్రభుత్వ కార్యాలయాలు లేదా ప్రముఖ నాయకులు మాత్రమే నిర్మించరని.. సామాన్య ప్రజల త్యాగాలు కూడా చరిత్రను నిర్మిస్తాయని అన్నారు.

స్వతంత్ర భారతదేశ ఏకీకరణలో భారతరత్న సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని రాధాకృష్ణన్ అన్నారు. బలమైన, ఏకీకృత భారతదేశానికి పటేల్ దృఢమైన పునాది వేశారని పేర్కొన్నారు. అసాధ్యంగా కనిపించిన హైదరాబాద్ ఏకీకరణను ఆయన సుసాధ్యం చేశారని కొనియాడారు. హైదరాబాద్ ప్రజలు రజాకార్లకు వ్యతిరేకంగా చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి అపారమని అన్నారు. హైదరాబాద్ విమోచన పోరాటంలో పాల్గొన్న యోధులకు, సర్దార్ పటేల్‌కు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు.

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ తదితర ప్రాంతాల్లో నక్సలిజాన్ని ఎదుర్కొనడంలో కేంద్ర బలగాలు కీలకంగా పనిచేశాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసులతో సమన్వయంతో కేంద్ర సాయుధ బలగాలు వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేశాయని తెలిపారు. నక్సల్ రహిత, సురక్షిత, అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంతో కేంద్ర బలగాలు పనిచేస్తున్నాయని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతకు కేంద్ర బలగాలు నిరంతరం కాపలాదారులుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం తగ్గిన తర్వాత ఆరోగ్యం, విద్య రంగాల్లో మార్పులు కనిపిస్తున్నాయని.. ముప్పు తగ్గడంతో గతంలో అస్థిరతకు గురైన ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధి, అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు.

రాజకీయ విలీనం భూభాగాలను ఏకం చేస్తే.. రాజ్యాంగ ప్రజాస్వామ్యం ప్రజలను ఏకం చేస్తుందని రాధాకృష్ణన్ అన్నారు. జాతీయ ఐక్యత కేవలం భౌగోళిక సరిహద్దులపై ఆధారపడి ఉండదని తెలిపారు. ప్రతి భారతీయుడికి సమాన హక్కులు, సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించినప్పుడే జాతీయ ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. భిన్న భాషలు మాట్లాడినా, భిన్న సంప్రదాయాలు పాటించినా, భిన్నంగా పూజలు చేసినా భారతీయులంతా రాజ్యాంగం, సార్వభౌమత్వ భావనతో ఒక్కటిగా ఉంటారని అన్నారు. మన సార్వభౌమత్వానికి అసలు అధికారం ప్రజలదేనని స్పష్టం చేశారు.

2022 నుంచి హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. దేశ ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "భారత్ ఒక్కటే.. భారత్ ఎప్పటికీ ఒక్కటిగానే ఉంటుంది. ఇదే సర్దార్ పటేల్‌కు మనం అందించే నిజమైన నివాళి" అని ఉపరాష్ట్రపతి అన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈసీ కసరత్తు!

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణలో త్వరలో ఖాళీ కాబోతున్న వరంగల్- ఖమ్మం-నల్గొండ, మహబూబ్ నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కోసం ఈసీ కసరత్తు మొదలు పెట్టింది. ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు నూతన ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ నియోజకవర్గాల స్థానాల గడువు మార్చి 2027తో ముగియనుండటంతో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్తగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నారు. 1 నవంబర్ 2026ను అర్హత తేదీగా పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ప్రాతినిథ్యం వహిస్తున్న సురభి వాణి దేవీ, వరంగల్- ఖమ్మం-నల్గొండ స్థానానికి ప్రాతినిథ్యం వహిస్తున్న తీన్మార్ మల్లన్న పదవీ కాలం వచ్చే మార్చితో ముగియనుంది.

పాత ఓటర్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే:

గత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారు కూడా ఈసారి కొత్తగా నమూనా ఫారమ్-18 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి అని ఈసీ స్పష్టం చేసింది. పాత ఓటరు జాబితా ఆధారంగా నేరుగా పేరు నమోదు చేయబడదని స్పష్టం చేసింది. దరఖాస్తుతో పాటు అవసరమైన విద్యా అర్హత సర్టిఫికెట్ల ధ్రువీకరించిన కాపీలను జతచేయాల్సి ఉంటుంది. అర్హులైన పట్టభద్రులు సీఈఓ అధికారిక వెబ్‌సైట్ https://ceotelangana.nic.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా నిర్ణీత ఫారమ్‌ను పూర్తి చేసి అవసరమైన పత్రాలతో ఈఆర్ఓ/ ఏఈఆర్ఓ/ డెసిగ్నేటెడ్ అధికారులకు నేరుగా కానీ, పోస్ట్ ద్వారా కానీ అందజేయవచ్చని సీఈఓ కార్యాలయం తెలిపింది.

**ఓటరు జాబితా షెడ్యూల్:**

పబ్లిక్ నోటీసు విడుదల: 28 సెప్టెంబర్2026

ఫారమ్-18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 6 నవంబర్ 2026

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ: 25 నవంబర్ 2026

అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ: 25 నవంబర్ 2026 నుండి 10 డిసెంబర్ 2026 వరకు

తుది ఓటర్ల జాబితా ప్రచురణ: 30 డిసెంబర్ 2026

## నాయుడు పెట్రోల్ పంప్ సమీపంలో ప్రమాదకర భారీ వృక్షాలు

### చెట్ల కిందే జ్యూస్,పానీపూరీ,పండ్ల బండ్లు
### గుంపులుగా జనం..ప్రమాదం జరిగితే భారీ ప్రాణనష్టం తప్పదంటున్న స్థానికులు

వరంగల్, సెప్టెంబర్ 17 (తెలుగు గళం)



వరంగల్-ఖమ్మం రోడ్డు నాయుడు పెట్రోల్ పంప్ సమీపంలో రహదారి వైపు ప్రమాదకరంగా వంగి ఉన్న భారీ వృక్షాలను వెంటనే తొలగించాలని స్థానికులు, వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఈ భారీ చెట్ల కిందనే జ్యూస్ బండ్లు, పానీపూరీ బండ్లు, పండ్ల బండ్లు ఏర్పాటు చేయడంతో పాటు చేపల విక్రయాలు కూడా జరుగుతున్నాయి.దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు గుంపులు గుంపులుగా చేరుతున్నారు. ఈ పరిస్థితుల్లో భారీ వృక్షాలు ఒక్కసారిగా కూలితే పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రమాదానికి గురై భారీ ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్ సమీపంలో భారీ వృక్షం ఆర్టీసీ బస్సుపై కూలిన ఘటన ప్రజల్లో భయాందోళన కలిగించింది. బస్సు, ఆటోలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో చెట్టు కూలడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన నేపథ్యంలో ప్రధాన రహదారులు, హైవేల వెంట ప్రమాదకరంగా ఉన్న చెట్లను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.మరోవైపు నాయుడు పెట్రోల్ పంప్ సమీపంలో డివైడర్ ఏర్పాటు చేయడంతో ఇప్పటికే రహదారి ఇరుకుగా మారిందని వాహనదారులు, బాటసారులు చెబుతున్నారు. దీనికి తోడు రహదారి పక్కన ఏర్పాటు చేసిన చిరు వ్యాపారాల కారణంగా ప్రజలు, వాహనాలు ఒకే ప్రాంతంలో ఎక్కువగా చేరుతుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని అంటున్నారు. ఇరుకైన రహదారిపై వాహనాలు, పాదచారులు ఇబ్బందులు పడటంతోపాటు తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే ప్రమాదాలను గుర్తించి నివారించాలని ప్రజలు కోరుతున్నారు.నాయుడు పెట్రోల్ పంప్ పరిసరాల్లోని ప్రమాదకర చెట్లను అధికారులు తక్షణమే పరిశీలించి, అవసరమైన చెట్లను తొలగించాలని, రహదారి ఆక్రమణలు మరియు రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారాల వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రహదారిని సురక్షితంగా, విశాలంగా మార్చేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

### -మాజీ కార్పోరేటర్ స్వరూప గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (తెలుగు గళం న్యూస్)





హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బౌద్ధనగర్ మాజీ కార్పొరేటర్ పి. స్వరూప గౌడ్ డిమాండ్ చేశారు.విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని వారసిగూడ చౌరస్తాలో బౌద్ధనగర్ బీజేపీ అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం అంబర్‌నగర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు కేక్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా స్వరూప గౌడ్ మాట్లాడుతూ..నిజాం పాలన, రజాకార్ల అకృత్యాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న వ్యాఖ్యలను ఆమె విమర్శించారు.సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.సెప్టెంబర్ 17ను అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని బీజేపీ దశాబ్దాలుగా పోరాడుతోందని స్వరూప గౌడ్ తెలిపారు. గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా ఈ చారిత్రక ఘట్టాన్ని విస్మరించాయని ఆమె ఆరోపించారు.అమరుల త్యాగాలను గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వం 2022 నుంచి హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సెప్టెంబర్ 17ను 'విలీన దినోత్సవం'గా పేర్కొనడం సరికాదని ఆమె అన్నారు. నిజాం పాలనకు, రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా హైదరాబాద్ సంస్థాన ప్రజలు సాగించిన పోరాటం, చేసిన త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ చారిత్రక ఘట్టానికి సంబంధించిన అంశాలను పాఠ్యపుస్తకాల్లో సముచితంగా చేర్చాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గతంలో కేసీఆర్ నిజాం పాలనపై చేసిన వ్యాఖ్యలను కూడా స్వరూప గౌడ్ ప్రస్తావిస్తూ విమర్శించారు. నిజాం పాలనలో జరిగిన పరకాల ఊచకోత, బైరాన్‌పల్లి ఘటన, మహిళలపై జరిగిన అకృత్యాలను గుర్తు చేసుకోవాలని అన్నారు.1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానానికి 1948 సెప్టెంబర్ 17 వరకు ప్రత్యేక పరిస్థితులు కొనసాగాయని ఆమె పేర్కొన్నారు.హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం కోసం రాంజీ గోండ్ నుంచి స్వామి రామానంద తీర్థ వరకు అనేక మంది జాతీయవాదులు పోరాటాలు చేశారని గుర్తుచేశారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నాయకత్వంలో చేపట్టిన చర్యల అనంతరం హైదరాబాద్ భారత యూనియన్‌లో అంతర్భాగమైందని తెలిపారు.కార్యక్రమంలో నేతి సత్యనారాయణ, భాస్కర్ గిరి, ఓములు, సంపత్ కుమార్, నాగరాజు, సుబ్బారావు, నవీన్, భిక్షపతి, ప్రమోద్, సందీప్, సత్యనారాయణ ముదిరాజ్, శ్రీనివాస్, కవిత, రూప్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రను వక్రీకరించే మతోన్మాద శక్తులను తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రతిఘటించాలి

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి, విముక్తి కోసం సాగిన మహత్తర పోరాటం
### ఎంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

తెలుగు గళం న్యూస్ వరంగల్, సెప్టెంబర్ 17





చరిత్రను వక్రీకరించే మతోన్మాద శక్తులను నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రతిఘటించాలని ఎంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గురువారం వరంగల్‌లోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ(యు) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు.నగర కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాదగోని రవి పాల్గొని మాట్లాడారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలోనే అత్యంత గొప్ప ప్రజా పోరాటాల్లో ఒకటని గాదగోని రవి అన్నారు.1946 నుంచి 1951 వరకు సాగిన ఈ పోరాటం భూమి కోసం, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం, దోపిడీకి వ్యతిరేకంగా, సామాజిక విముక్తి కోసం సాగిందని తెలిపారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దోపిడీ, దొరల పెత్తనం, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా వేలాది మంది రైతులు, కూలీలు, మహిళలు, యువత ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు.దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ వంటి పోరాట యోధులు, అమరవీరులు ప్రజల్లో తిరుగుబాటు స్ఫూర్తిని రగిలించారని అన్నారు.ఈ పోరాటంలో అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సంఘటితమై భూస్వామ్య దోపిడీకి సవాల్ విసిరారని తెలిపారు.తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను మతపరమైన కోణంలో వక్రీకరించడం, వాస్తవ చారిత్రక అంశాలను మరుగునపరచడం చరిత్రకు, ప్రజాస్వామ్య విలువలకు అన్యాయమని గాదగోని రవి అన్నారు. ప్రజల హక్కుల కోసం జరిగిన పోరాటాలను కులం, మతం పేరుతో విభజించకుండా వర్గ ఐక్యతతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రస్తుత కాలంలోనూ రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, కూలీలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. భూమి, ఉపాధి, విద్య, వైద్యం, గృహం, సామాజిక భద్రత వంటి మౌలిక హక్కుల కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను కేవలం చారిత్రక జ్ఞాపక కార్యక్రమంగా కాకుండా, నేటి ప్రజా సమస్యలపై జరిగే పోరాటాలకు స్ఫూర్తిగా మలచాలని పిలుపునిచ్చారు.చరిత్రను వక్రీకరించే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) పొలిట్‌బ్యూరో సభ్యులు మోర్తాల చందర్‌రావు, కేంద్ర కమిటీ సభ్యులు సింగతి సాంబయ్య, గోనె కుమారస్వామి, హన్మకొండ జిల్లా కార్యదర్శి హంసారెడ్డి, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు నర్ర ప్రతాప్, కుసుంబ బాపురావు, రాగసుధ, ముక్కెర రామస్వామి, నాగెల్లి కొమురయ్య, సింగతి మల్లికార్జున్, గడ్డం నాగార్జున, నర్సయ్య, బాషపాక రమేష్, మాలోతు ప్రత్యుష, గణిపాక ఓదెలు, దాసు, అప్పనపూరి నర్సయ్య, ముత్యం లలిత తదితరులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాలని సమావేశం పిలుపునిచ్చింది.

## గుంతలమయమైన రహదారికి తక్షణ మరమ్మతులు

### ప్రజల ఇబ్బందులు గుర్తించి స్పందించిన సర్పంచ్ ఈసం జనార్దన్
### వర్షపు నీటితో దెబ్బతిన్న రహదారికి ఊరట
### మొరం పోయించి యంత్రంతో రోడ్డు చదును చేయించిన సర్పంచ్

తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 17:



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట గ్రామపంచాయతీ పరిధిలోని ముళ్లకట్ట రాంపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు గ్రామ సర్పంచ్ ఈసం జనార్దన్ తక్షణ పరిష్కారం చూపించారు. ముళ్లకట్ట రాంపూర్‌కు జాతీయ రహదారి 163 నుంచి పంచాయతీరాజ్ తారు రోడ్డుకు మధ్యన ఉన్న గ్రావెల్ రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతింది. వర్షపు నీరు రహదారిపై నిలిచిపోవడంతో పలుచోట్ల పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ ఈసం జనార్దన్ వెంటనే స్పందించి రహదారి పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మొరం పోయించి, జేసీబీ యంత్రం సహాయంతో రహదారిని చదును చేయించి లెవల్ చేయించారు. దీంతో రహదారిపై ఏర్పడిన గుంతలు పూడ్చుబడి వాహనాల రాకపోకలకు కొంత మేరకు సౌకర్యం కలిగింది. ప్రజలకు ఇబ్బంది కలిగించే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో గ్రామపంచాయతీ తరఫున తక్షణ చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ఈసం జనార్దన్ తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.






వర్షాకాలంలో రహదారులపై నీరు నిలిచిపోకుండా శాశ్వతంగా మురుగు నీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, రహదారికి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం రహదారిపై గుంతలు పూడ్చి చదును చేయడంతో రాకపోకలకు ఏర్పడిన ఇబ్బంది తగ్గిందని గ్రామస్థులు తెలిపారు. ప్రజల సమస్యను తెలుసుకున్న వెంటనే స్పందించి రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన సర్పంచ్ ఈసం జనార్దన్‌ను స్థానిక ప్రజలు అభినందించారు.

## సూపర్ ఎల్ నినోను తట్టుకునేలా వ్యవసాయ ప్రతిస్పందన మార్గాలు



2026--27లో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటే, దాని ప్రభావం ప్రపంచ వాతావరణ వ్యవస్థతో పాటు భారతదేశ వ్యవసాయ రంగంపైనా పడే అవకాశం ఉంది.ముఖ్యంగా మాన్సూన్‌పై అధికంగా ఆధారపడే భారత వ్యవసాయానికి వర్షపాతం లోపం, ఉష్ణోగ్రతల పెరుగుదల, వాతావరణ అస్థిరత వంటి పరిణామాలు సవాళ్లుగా మారవచ్చు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రతల్లో మార్పులు వాతావరణ ప్రసరణ వ్యవస్థను ప్రభావితం చేయడం ద్వారా భారత మాన్సూన్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.వర్షపాతం తగ్గడం లేదా అసమానంగా ఉండటం వల్ల నేలలో తేమ తగ్గుతుంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా మొక్కల్లో నీటి ఆవిరీభవనం పెరిగి, వాటి నీటి అవసరం మరింత అధికమవుతుంది.ఫలితంగా పంటలు నీటి ఒత్తిడి, ఉష్ణ ఒత్తిడికి గురై దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది.వర్షాలు తగ్గితే భూగర్భ జలాల రీచార్జ్ కూడా మందగించి బోర్లపై ఆధారపడే రైతులపై అదనపు ఆర్థిక భారం పడవచ్చు.నీటి వనరులపైనా దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది. రిజర్వాయర్లు, చెరువులు, నదుల్లో నీటి లభ్యత తగ్గితే సాగునీటి సరఫరా అస్థిరమవుతుంది. దీని ప్రభావం పంటల ఎంపిక నుంచి పశుపోషణ వరకు విస్తరించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచవచ్చు. అందువల్ల వాతావరణ అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు వ్యవసాయ ప్రణాళిక అవసరం.ఈ పరిస్థితుల్లో పంటల మార్పిడి, పంటల వైవిధ్యం రైతులకు ఉపయోగకరమైన వ్యూహాలుగా నిలుస్తాయి. ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ పంటలను సాగు చేయడం ద్వారా వాతావరణ ప్రమాదాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చు. అధిక నీటి అవసరం ఉన్న వరి, చెరకు వంటి పంటలతో పాటు ప్రాంత పరిస్థితులకు అనుగుణంగా జొన్న, సజ్జ, రాగి, పెసలు, కంది వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను పరిగణనలోకి తీసుకోవచ్చు. పంటల మార్పిడి ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు తెగుళ్లు, వ్యాధుల ప్రభావాన్ని కూడా తగ్గించే అవకాశం ఉంటుంది.నీటి యాజమాన్యం ఈ పరిస్థితుల్లో అత్యంత కీలకం. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను అవసరమైన చోట ప్రోత్సహించాలి.మల్చింగ్ ద్వారా నేలలోని తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచి ఆవిరీభవనాన్ని తగ్గించవచ్చు. అదేవిధంగా వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల రీచార్జ్ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. స్థానికంగా లభించే ప్రతి నీటి వనరును సమర్థంగా వినియోగించే విధానాలు రూపొందించాలి.కాలానుగుణంగా సరైన విత్తనాల ఎంపిక కూడా రైతులకు ఎంతో ఉపయోగకరం.వర్షపాతం ఆలస్యమయ్యే లేదా తక్కువగా ఉండే పరిస్థితుల్లో తక్కువ వ్యవధిలో పంటను పూర్తి చేసే రకాలను, ప్రాంతానికి అనుకూలమైన ఎండను తట్టుకునే రకాలను వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఎంపిక చేసుకోవాలి. రబీ కాలంలో నేలలో మిగిలిన తేమకు అనుగుణంగా తక్కువ నీటితో సాగు చేయగల పప్పుధాన్యాలను పరిగణించవచ్చు. వాతావరణ మార్పులను తట్టుకునే రకాల అభివృద్ధి, అందుబాటులోకి వచ్చిన వాటి విస్తరణ కూడా అవసరం.మట్టిసార నిర్వహణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. సేంద్రీయ పదార్థాలు, పచ్చిరొట్ట ఎరువులు, కంపోస్ట్ వంటి వాటి వినియోగం నేల నిర్మాణం, నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వల్ల వర్షాభావ పరిస్థితుల్లో పంటలు కొంత మెరుగ్గా తట్టుకునే అవకాశం ఉంటుంది. నేల పరీక్షల ఆధారంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించడం కూడా అవసరం.ప్రభుత్వ సహాయం, పంట బీమా, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు రైతులకు రక్షణ కవచంగా నిలుస్తాయి.ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి పంట బీమా పథకాల ప్రయోజనాలను రైతులకు చేరేలా చూడాలి. సూక్ష్మ నీటిపారుదల పరికరాలకు అందుబాటులో ఉన్న సబ్సిడీలను రైతులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి.వాతావరణ హెచ్చరికలు, అగ్రోమెట్ సలహాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, రైతు వేదికల ద్వారా శాస్త్రీయ సమాచారాన్ని రైతులకు సకాలంలో అందించాలి. అదేవిధంగా సామూహిక చర్యలు కూడా ఎంతో ముఖ్యమైనవి. రైతు సంఘాలు, నీటి వినియోగదారుల సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, క్లస్టర్ ఆధారిత సాగు వంటి వ్యవస్థల ద్వారా నీరు, విత్తనాలు, యంత్రాలు, ఎరువుల వినియోగాన్ని సమన్వయం చేసుకోవచ్చు. నీటి కొరత ఉన్న సమయంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా, సమానంగా వినియోగించుకోవడానికి సామూహిక నిర్ణయాలు ఉపయోగపడతాయి. మొత్తంగా ఎల్ నినో వంటి వాతావరణ పరిస్థితులు వ్యవసాయ రంగానికి సవాళ్లు విసిరే అవకాశం ఉన్నప్పటికీ, ముందస్తు ప్రణాళికతో వాటి ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. రైతులు పంటల వైవిధ్యం, తక్కువ నీటి అవసరమున్న పంటలు, సూక్ష్మ నీటిపారుదల, మట్టిసార పరిరక్షణ వంటి పద్ధతులను అనుసరించాలి.శాస్త్రవేత్తలు స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన సాంకేతిక పరిష్కారాలను అందించాలి. ప్రభుత్వం పంట బీమా, నీటి సంరక్షణ, నాణ్యమైన విత్తనాలు, వాతావరణ సమాచార వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి.రైతులు--శాస్త్రవేత్తలు--ప్రభుత్వం సమన్వయంతో పనిచేసినప్పుడే వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, నీటి సంరక్షణ, పంటల వైవిధ్యం, ముందస్తు వాతావరణ హెచ్చరికలు వ్యవసాయాన్ని మరింత స్థిరంగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి.





-- కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి
చైర్మన్ -- ఆత్మ కమిటీ,
పటాన్‌చెరు, తెలంగాణ.
మొబైల్: 9849028446


## భూపాలపల్లి అటవీ భూములపై సీఎం వ్యాఖ్యలు అవాస్తవం:మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

### 106 ఎకరాల భూమిపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?
### భూముల కబ్జా కోసమే '22ఏ' తెచ్చారు..
### చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి



భూపాలపల్లి పట్టణ పరిధిలోని 106 ఎకరాల అటవీ (జయశంకర్ ఎకో పార్క్) భూములపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ సాక్షిగా చేసిన వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలని,వాస్తవాలను వక్రీకరించి సభను తప్పుదోవ పట్టించారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలు సత్యదూరం**

గత కేసీఆర్ ప్రభుత్వం 106 ఎకరాల విలువైన భూమిని తనకు ధారాదత్తం చేసిందంటూ ముఖ్యమంత్రి ఆరోపించడం అవివేకమని గండ్ర అన్నారు.ఈ భూముల పూర్వాపరాలను తెలుసుకోకుండా సీఎం మాట్లాడటం శోచనీయమన్నారు.1985లో మహమ్మద్ అబ్దుల్ ఖాసిం అనే వ్యక్తి వరంగల్ కోర్టులో వేసిన పిటిషన్ ఆధారంగా,2021లో ఈ భూమి ప్రైవేటు వ్యక్తులకే చెందుతుందని కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు.ఆ సమయంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కొందరు ఆక్రమణలకు యత్నించగా,అటవీ శాఖ అధికారులతో మాట్లాడి వాహనాలను సీజ్ చేయించి కేసులు నమోదు చేయించామని తెలిపారు.అంతటితో ఆగకుండా,పట్టణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అప్పటి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ సహకారంతో ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయించామన్నారు.సుదీర్ఘ న్యాయపోరాటం ఫలితంగా 2024లో సుప్రీంకోర్టు ఆ 106 ఎకరాలను అటవీ భూమిగానే నిర్ధారిస్తూ తీర్పునిచ్చిందని వివరించారు.అలాంటి భూమిలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూర్బన్,డీఎంఎఫ్‌టీ నిధులతో సుందరమైన జయశంకర్ ఎకో పార్క్‌ను,వాకింగ్ ట్రాక్‌లు,పిల్లల ఆట స్థలాలను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని స్పష్టం చేశారు.

**సిట్టింగ్ జడ్జితో విచారణకు సవాల్**

తాను ఆ 106 ఎకరాలను కబ్జా చేసినట్లు నిరూపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు.చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో ఈ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.గతంలో ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి తనపై 1,400 ఎకరాల భూకబ్జా ఆరోపణలు చేసినందుకే కోర్టులో క్రిమినల్,పరువు నష్టం దావాలు వేశామని,అవి ప్రస్తుతం విచారణలో ఉన్నాయని తెలిపారు.తాజా అసెంబ్లీ ఆరోపణలపైనా ముఖ్యమంత్రిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**హామీలను గాలికొదిలేసి ప్రతిపక్షాలపై బురద**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల భూములు కబ్జా చేసేందుకే '22ఏ' నిబంధనలను తెరపైకి తెచ్చిందని,సీఎం తన సొంత ఆదాయ వనరులను పెంచుకోవడానికే రాష్ట్రాన్ని పాలిస్తున్నారని విమర్శించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన రైతు రుణమాఫీ,రైతు భరోసా,నిరుద్యోగ భృతి,జాబ్ క్యాలెండర్,మహిళలకు ఆర్థిక సాయం,విద్యార్థినులకు స్కూటీలు,కులగణన,దళిత బంధు అమలును గాలికొదిలేసి ప్రతిపక్షాలపై విమర్శలతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ తరఫున రాజీలేని పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు.

# ఎస్ఆర్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ 2026 బ్యాచ్‌కు ఓరియంటేషన్ కార్యక్రమం

**తెలుగు గళం న్యూస్ వరంగల్, సెప్టెంబర్ 17**






ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లో నూతనంగా ప్రవేశం పొందిన బీ.ఎస్సీ. (ఆనర్స్) అగ్రికల్చర్, ఎం.ఎస్సీ. అగ్రికల్చర్ 2026 బ్యాచ్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డా. జి. భూపాల్ రాజ్ స్వాగత ప్రసంగం చేస్తూ ప్రస్తుత కాలంలో వ్యవసాయ రంగానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లో కొనసాగుతున్న విద్యా, పరిశోధన, ఫీల్డ్ వర్క్, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఐసీఏఆర్ అక్రిడిటేషన్ పొందిన రెండు తెలుగు రాష్ట్రాల్లోని తొలి ప్రైవేట్ యూనివర్సిటీగా ఎస్ఆర్ యూనివర్సిటీకి ఉన్న ప్రత్యేకతను, వ్యవసాయ విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఉద్యోగ, ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలను వివరించారు.వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ..వ్యవసాయ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, స్కిల్ డెవలప్‌మెంట్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు. భవిష్యత్ అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.డీన్--ఆపరేషన్స్ అండ్ గ్రోత్ డా. ఆర్. అర్చనా రెడ్డి యూనివర్సిటీ అభివృద్ధి, విద్యా రంగంలో సంస్థ సాధిస్తున్న పురోగతిని వివరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ జి.వి. సుబ్బారెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. ప్రస్తుత తరంలో వ్యవసాయ రంగానికి ఉన్న ప్రాధాన్యతతో పాటు వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయంలో చోటుచేసుకుంటున్న మార్పులను వివరించారు.దేశవ్యాప్తంగా వ్యవసాయ విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ కెరీర్ అవకాశాలను వివరించారు.ఎస్ఆర్ యూనివర్సిటీ ఛాన్సలర్ శ్రీ ఏ. వరదా రెడ్డి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని అన్నారు.వ్యవసాయ విద్యను ఎంచుకున్న నూతన విద్యార్థులను అభినందిస్తూ అంకితభావంతో విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సీనియర్ రెండో, మూడో సంవత్సరం బీ.ఎస్సీ. అగ్రికల్చర్ విద్యార్థులు తమ విద్యా అనుభవాలను నూతన విద్యార్థులతో పంచుకున్నారు.యూనివర్సిటీ నాయకత్వం, ముఖ్య అతిథి, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# గణేష్ ఉత్సవాల్లో భక్తితో పాటు భద్రతను మరవద్దు

## అన్నప్రసాద కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ డీఈ బి.సారయ్య



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 17**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భక్తితో పాటు విద్యుత్ భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని స్టేషన్ ఘనపూర్ డీఈ బి.సారయ్య కోరారు.గురువారం మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎన్పీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో డీఈ బి.సారయ్య, ఏడీఈ పి.రణధీర్ రెడ్డి సహకారంతో టౌన్ విద్యుత్ సిబ్బంది నిర్వహించిన మహా అన్నప్రసాద కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో విద్యుత్ సిబ్బంది ప్రతిష్ఠించిన లక్ష్మీ గణపతి సన్నిధిలో నాలుగో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన పురోహితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలోని ఇంజినీర్లు, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఈ సారయ్య మాట్లాడుతూ నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమై ఉండే విద్యుత్ సిబ్బందికి అన్నప్రసాద కార్యక్రమం కొంత విశ్రాంతితో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందించిందన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు సిబ్బందిలో ఉత్సాహాన్ని పెంపొందించడంతో పాటు సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, భక్తిశ్రద్ధలతో పాటు విద్యుత్ భద్రతా సూచనలు పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా విద్యుత్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు.ఉత్సవ కమిటీ నిర్వాహకులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈలు శ్వేత, శంకర్, రవీందర్, రమేష్, శివకుమార్, సురేష్, కరుణాకర్, సబ్ ఇంజినీర్లు సాధన, హరిత, రాకేష్, మన్విత, ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, జిల్లా సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రాజ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వాసం శ్రీధర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ పన్నీరు సందీప్, సీనియర్ నాయకులు యాదగిరి, వీరస్వామి, అర్చన, రామాచారి, కాలురామ్, సుకేష్, లక్ష్మీ, శ్రీనివాస్, వెంకటేష్, లక్ష్మణ్, కాంట్రాక్టర్లు అమరేందర్, రఘురెడ్డి, సురేందర్‌రెడ్డి, సిద్దు, హరీష్, రమేష్, అన్వర్‌పాషా, లక్పతి, యుగేందర్, సాయిబాబు, అశోక్, వెంకటేష్, ప్రభాకర్, సురేష్, శ్రీను, అశోక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సివిల్ కోర్టు పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్

**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**








మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలో నూతనంగా సివిల్ కోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లను గురువారం డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టులో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. కోర్టు భవనంలో జరుగుతున్న పనుల పురోగతి, మౌలిక వసతులు, సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, యువ నాయకులు నూకల అభినవ్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మరిపెడ టౌన్ అధ్యక్షులు పానుగోతు రామ్ లాల్,వైస్ చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,స్థానిక అధికారులు స్థానిక తహసీల్దార్ కృష్ణవేణి,సీఐ పవన్ కుమార్,ఎస్సై సతీష్,కమిషనర్ నరేష్ రెడ్డి,కౌన్సిలర్లు జాటోత్ సురేష్,మెరుగు రాము,జియో రమేష్,గంట్ల గౌతమ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ అబ్జర్వర్ అవీజ్ ఖాన్,మండలాధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్,షేక్ తాజోద్దీన్, షేక్ ఆఫ్జల్,గంధసిరి బిక్షపతి,విజయ్ నాయక్,యాకుబ్ పాషా, బోడ రవి, చీనా నాయక్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# అంజయ్య నగర్ డివిజన్లో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు




**తెలుగు గళం. శేర్లింగంపల్లి సెప్టెంబర్ 17:** శేరిలింగంపల్లి నియోజకవర్గం అంజయ్య నగర్లో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు అనంతరం జాతీయ జెండాను బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవి కుమార్ యాదవ్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను అమరత్వ స్ఫూర్తిని స్మరించుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు భారత తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆపరేషన్ పోలో ద్వారా నిజాం మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేశారు దీనికి గుర్తుగానే ప్రతి ఏటా సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు తెలంగాణ స్వతంత్రం కోసం భారత్ లో విలీనం కోసం ప్రాణాలర్పించిన పోరాట యోధులను స్మరించుకున్నారు ప్రతి ఒక్కరూ బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి పద్మ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు సాగర్ సీనియర్ నాయకులు వినయ్ , ఓబుల్ రెడ్డి భాస్కర్ రెడ్డి సరోజ ఆమని కిషన్ సింగ్ ముఖేష్ తదితరులు పాల్గొన్నారు

# నిజాంపై పోరాడిన తెలంగాణ యోధుడు సిల్వేరి పోల్కయ్య



**హైదరాబాద్:** నిజాం నిరంకుశత్వానికి, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ యోధుడు సిల్వేరి పోల్కయ్య (1930--2007). చిన్నతనంలోనే కమ్యూనిస్టు ఉద్యమంలోకి అడుగుపెట్టిన ఆయన, పాటలు, ప్రసంగాల ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. గుండ్రాంపల్లి, మంగళపల్లి, ఆరుట్ల ప్రాంతాల్లో రజాకార్లకు ఎదురొడ్డి నిలిచి, ప్రముఖ నాయకుడు బొమ్మగాని ధర్మభిక్షంతో కలిసి ఉద్యమాల్లో పాల్గొన్నారు. పలుమార్లు జైలు శిక్ష అనుభవించినా, 1948 విలీనం తర్వాత కూడా ప్రజాపోరాటాలు కొనసాగించారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ కుమారుడు సిల్వేరి శ్రీశైలం జర్నలిజం రంగంలో పనిచేస్తున్నారు. తెలంగాణ ప్రజా పోరాటంలో పోల్కయ్య సేవలు చిరస్మరణీయం.

# కుంచపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం"




**సత్తుపల్లి/ వేంసూరు,సెప్టెంబర్17(తెలుగు గళం) న్యూస్:** నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలో గల కుంచపర్తి గ్రామపంచాయతీ పరిధిలోని కుంచపర్తి-2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.బీరాపల్లి సెక్టార్ సూపర్ వైజర్ ఇజ్జిగాని గంగాజలం పర్యవేక్షణలో గ్రామ సర్పంచ్ నెల్లూరు స్పందన రాకేష్ సమక్షంలో కార్యక్రమం ఘనంగా జరిగింది. తక్కువ ఖర్చుతో పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. పోషక విలువలు కోల్పోకుండా ఆహారాన్ని వండే విధానం, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన ఆహారంపై ఐసిడిఎస్ సత్తుపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ బి.సత్యవతి అవగాహన కల్పించారు. నలుగురు గర్భిణీలకు సీమంతం, నలుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో: ప్రధానోపాధ్యాయులు లాల్ మహమ్మద్, ఉపాధ్యాయులు ఐ.చిన్న వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, అంగన్‌వాడీ సిబ్బంది రత్నకుమారి, వాణి, ఆయాలు కనకమ్మ, సుజన, గ్రామ పెద్దలు, తల్లులు పాల్గొన్నారు.

# రేగొండలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ

**తెలుగు గళం న్యూస్ రేగొండ**



తెలంగాణ (విమోచన) ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రేగొండ మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నం రవి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పున్నం రవి మాట్లాడుతూ..తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని,వారి పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ,తెలంగాణ సమగ్ర అభివృద్ధి,ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య,టౌన్ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల బిక్షపతి,మాజీ ఎంపీటీసీలు మైస బిక్షపతి,పట్టెం శంకర్,నాయకులు ముడతనపల్లి శంకరయ్య,గంగుల రమణారెడ్డి,కటంగూరి మనోహర్ రెడ్డి,కోలేపాక సాంబయ్య,ఎడ్ల మల్లారెడ్డి,క్యాతం సదయ్య,పెండల ఉపేందర్,యూత్ నాయకులు పున్నం ప్రవీణ్,భాస్కర్ తదితర కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# రామానగరం లో పోషణా మాసోత్సవాలు"

**సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్17(తెలుగు గళం) న్యూస్:** మండల పరిధిలోని అయ్యగారిపేట సెక్టార్ లో గల రామానగరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలలో సేవలు పొందుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో గురువారం సూపర్ వైజర్ యు. మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా పోషణా మాసోత్సవాలు జరిగాయి. లబ్దిదారులతో కలసి తమ గ్రామంలో పోషణ లోపాలు,రక్త హీనత లేకుండా ఆరోగ్య గ్రామంగా ఉండేదానికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలు ఏమిటో మహాలక్ష్మి వివరించారు. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాలతో కూడిన ఒక్క పూట భోజనం భుజిస్తే,పాలు సేవించినట్లయితే రక్తహీనత నుండి తల్లి బిడ్డలు క్షేమంగా ఉంటారని ఆమె సూచించారు.అనంతరం ఐదుగురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు. గర్భిణీలకు శ్రీమంతాలు చేశారు.ఈ కార్యక్రమంలో: (ఏఐబి) ఎన్జీఓ బాబు,చంద్రమోహన్,క్లస్టర్ హెల్త్ ఆఫీసర్ పద్మావతి,హెచ్ వి శారా రాణి,ఏ ఎన్ ఎం సుజాత, అంగన్వాడీ టీచర్స్ భారతి, సర్వేశ్వరీ, సుజాత, సౌభాగ్యం, స్వాతి, రాధ, రహంతున్నిస, హెల్పర్ అమృతలక్ష్మీ, ఆశాలు జమలమ్మ, జమాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



# బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సాయం"



**సత్తుపల్లి,సెప్టెంబర్17(తెలుగు గళం) న్యూస్:** సోషల్ మీడియా ద్వారా చిన్నారి అనారోగ్య పరిస్థితిని తెలుసుకున్న అమెరికాలో నివాసముంటున్న చల్లగుళ్ల నిఖిల్ స్పందించి, తన తండ్రి, ప్రముఖ సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు ద్వారా చిన్నారి వైద్య ఖర్చులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. వివరాలలోకి వెళితే ఖమ్మంజిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ 6వ వీధిలో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి చార్లెస్ ఫిన్నీ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. చిన్నారికి వైద్యం చేయించేందుకు ఆర్థిక స్థోమత లేక తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా దేశ సరిహద్దులు దాటి అమెరికాలో నివసిస్తున్న చల్లగుళ్ల నిఖిల్ దృష్టికి చేరింది.చిన్నారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న నిఖిల్ మానవతా దృక్పథంతో స్పందించి, తన తండ్రి చల్లగుళ్ల నరసింహారావుకు సమాచారం అందించి, చిన్నారికి సహాయం చేయాలని కోరారు. దీంతో చల్లగుళ్ల నరసింహారావు గురువారం సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రెహనా బేగం కమలపాషా తో కలిసి చిన్నారి కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటిన తండ్రి కొడుకులకు పలువురు అభినందనలు తెలిపారు.

# కొత్తపల్లి గోరిలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం' వేడుకలను కొత్తపల్లి గోరిలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం,పోలీస్ స్టేషన్లలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ బి.శ్రీలత జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.భూమి,భుక్తి,విముక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ,దొడ్డి కొమురయ్య వంటి యోధులు,అమరవీరుల త్యాగాలు తెలంగాణ సమాజానికి నిత్యస్ఫూర్తి అని కొనియాడారు.వారి ఆశయాలను స్మరించుకుంటూ ప్రభుత్వం ఈ వేడుకలను నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ గిర్ధవర్ సి.హెచ్.రాజ్యలక్ష్మి,సీనియర్ సహాయకులు కె.జ్యోత్స్న,జూనియర్ సహాయకులు పి.రాజయ్య,ఎన్.వెంకటేష్,ఎం.జ్యోతి,వి.శ్వేత ,జి.అరవింద్,జీపీవోలు రమేష్,అమరేందర్ రెడ్డి,సంపత్,రవీందర్,బిక్షపతి,సురేష్,రాజారామ్,సిబ్బంది పాల్గొన్నారు.అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ,ప్రజాస్వామ్య వ్యవస్థ,జాతీయ సమైక్యత,ప్రజల హక్కులు,పారదర్శక పాలనను పెంపొందించడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజబాబు మృతి బాధాకరం.. కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి సీతక్క

## రాజబాబు కుటుంబానికి అండగా ఉంటాం.. ఆపదలో నేనున్నానంటూ భరోసా

## నర్సాపూర్ మాజీ సర్పంచ్ రాజబాబుకు కన్నీటి వీడ్కోలు..




**తెలుగు గళం వెంకటాపూర్, సెప్టెంబర్ 17:**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నర్సాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పిల్లలమర్రి రాజబాబు అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సెప్టెంబర్ 16న రాజబాబు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క గురువారం నర్సాపూర్ గ్రామానికి చేరుకుని రాజబాబు పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన అంత్యక్రియల్లో మంత్రి సీతక్క పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజబాబు మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, రాజబాబు కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామ మాజీ సర్పంచ్‌గా రాజబాబు ప్రజలకు చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు నాయకులు స్మరించుకున్నారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ గ్రామాభివృద్ధి కోసం పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాజబాబు మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలకు కూడా తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీరాజ్ రాష్ట్ర డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.